

# బోధివృక్షము, ఒక మేడ





సెప్టెంబరు నెల రాత్రి. శత్రువులా చీకటి. మేడ చుట్టూ లైట్లు. తగలబడుతున్న కొవ్వొత్తుల్లా. లోపలి గదుల్లో లైట్లు ఒక్కొక్కటే ఆరిపోతున్నాయి. భారమైన నిశ్శబ్దం మేడ చుట్టూ పరచుకొంది. వాచ్‌మెన్ నావైపు అసహనంగా చూసి గేటు దగ్గరగా వేశాడు. నిర్మానుష్యమైన ప్రదేశం. దగ్గరలో ఇళ్ళే లేవు. రాతిగుట్టలు, ఇంకా చదును చెయ్యని పొదలు – దూరం నుంచి నీళ్ళు ప్రవ హిస్తున్న చప్పుడు. నేల కింది పొరల్లోంచి సన్నగా సిటీ తాలుకు అరుపులు, కేకలు.

చదునైన రాతిపై చతికిలబడి, కాళ్ళు ముందుకు చాపుకొని, తల, వీపు అట్లాగే వెనక్కు వాల్చుకొని – ఆకాశం నాకు బాగా దగ్గరైనట్లుగా – అట్లా ఆ భంగిమలో ఎప్పటి నుంచో. సరిగ్గా తొమ్మిది గంటలకు వచ్చానిక్కడికి. లోపల గడిపింది రెండు నిముషాలే. బెడ్‌పైన నిస్త్రాణంగా మూసేసిన పుస్తకంలా ఆయన పడుకొని ఉన్నాడు. చుట్టూ డాక్టర్లు.

మధ్యాహ్నం మోహిని నా కొత్త కథకు బొమ్మలేస్తూ, హఠాత్తుగా ఎర్ర రంగును బొమ్మపై ఒలకబోసింది. "గాయాల చరిత్ర కదా. కాస్తంత రక్తం ఒలకవద్దా!" అంది చాలా గంభీరమైన స్వరంతో. కాగితాలన్నీ ఒకటిగా పేర్చి, కుట్టి, గ్లూబైండింగ్ చేసి, మంచంపై పడుకోబెట్టినట్లుగా – ఆయన, చిత్రంగా ఇక్కడా ఎర్రరంగు ఒలకబోసినట్లుగా – బెడ్‌షీట్‌పై ఎర్రగా స్టెయిన్ అయిన రక్తపు మరకలు, మంచం కింద తెల్లటి టైల్స్‌పై బొట్లు బొట్లుగా గడ్డ గట్టిన – నల్లటి ఎరుపురంగు మరకలు – బెజవాడ నుండి ఫోన్ వచ్చినప్పుడు, మోహిని ఇంకా ఎర్రరంగును బ్రెష్‌తో కెలుకుతూ వుంది. "ఆయన సూసైడ్ చేసుకోవ డానికి ప్రయత్నించాడు. బ్లేడుతో చేతిపై కోసుకొని, చాలా రక్తంపోయింది" అదీ మెసేజ్. ఒక వృద్ధురాలి స్వరం అది. "ఏమిటి కారణం?" అన్నాను ఫోను లోని మనిషితో. అటువైపు నుంచి గాఢమైన నిట్టూర్పు. "ముసలితనం, ఒంటరి మనిషి. ఉద్యమాలు, కలలు ఏమున్నాయి యిప్పుడు." ఫోన్ క్లిక్‌మన్న చప్పుడు.

మేడ బయట రాతిపై పడుకొని, ఆకాశానికి దగ్గరయినట్లుగా. చుక్కలు లేని ఆకాశం. మబ్బులు ఆరబెట్టుకొంటూ, నది, దూరంగా ఎక్కడో. కానీ పక్క నుంచే వెళుతున్నట్లుగా, శరీరంపై తడి. చీకటి, మంచు, నిశ్శబ్దం, మబ్బుల ఆకాశం – లోపల మంచంపై తెరవని పుస్తకంలా ఆయన – ఆయన నావైపు చూడలేదు. నిద్రపోతున్నాడో లేదా ఒట్టినే కళ్ళు మూసుకొన్నాడో తెలియదు. మంచం దగ్గర రెండు నిముషాలు మౌనవ్రతం చేసినవాడిలా – ఇద్దరు ముసలి

వాళ్ళు, వెనక కుర్చీల్లో కూర్చుని, నాకేదైనా సానుభూతి మాటలు చెప్పాలనుకొని - వాళ్ళకా అవకాశం యివ్వకుండానే బయటకు వచ్చాను. మంచం చుట్టూ డాక్టర్లు, అభిమానులు. గంభీరంగా వుందా సన్నివేశం.

గేటు దగ్గరి లైటు తప్ప మిగిలిన లైట్లు ఆర్పివేశాడు వాచ్‌మెన్. "మీకోసం లోపల గెస్ట్‌రూమ్ తీసి వుంచాము" దగ్గరకు వచ్చి మరోసారి అడిగాడు. నేను వద్దన్నట్లుగా సైగ చేశాను. రాతిపై పడుకొని ఆకాశానికి తల వేలాడదీసుకొన్న నన్ను చూసి నిట్టూర్చి వెళ్ళి గేటు లాక్ చేసుకొన్నాడు.

చీకటి మెత్తటి చేతుల్తో ఒంటిపైకి పాకుతుంది. పై నుంచి మబ్బులు మెల్లగా కదుల్తూ. క్వేక్ క్వేక్ అంటూ చప్పుడు. మబ్బులు చప్పుడు చేస్తాయా బహుశా గూడ బాతులు కావచ్చు. నది దగ్గరలో ఎక్కడో తిరుగుతూ. వాటి మెత్తటి అడుగుల చప్పుడు కూడా వినిపిస్తుంది. బూరలాంటి పెద్ద వాయిద్యం మోగుతున్నట్లుగా వాటి అరుపులు.

ఈ రేయి, వేలాడుతున్న ఆకాశం, ఆత్మకు తడితడిగా నది, తెల్లని అడవుల్లా నడిచి వెళ్ళే బాతులు - ఒంటరి మేడ - ఒక 'డి-జావ్' ఫీలింగ్‌ను కలిగిస్తున్నాయి. నలభైయేళ్ళు అటూ, ఇటూ ఎటు జరిగినా ఇదే దృశ్యం. బహుశా ఒక ముప్ఫయ్యేళ్ళ క్రితం అయితే ఈ దృశ్యంలో అమ్మ వుండేది. అప్పుడూ, ఇప్పుడూ కఠినమైన నిఘంటువులా ఆయన. మధ్యలో చాలా యేళ్ళు ఈ మేడ ఒంటరిగా ఉండేది. దీన్ని ఆయన పార్టీ ఆఫీసుకు ఇవ్వకముందు, చుట్టుపక్కల ఆవారా కుర్రవాళ్ళకు రహస్య ప్రేమల గృహంలా ఉండేది. "వేలవేల వీర్యపు చుక్కలు. ఆ చుక్కల్లోంచి క్లోనింగ్ బేబీలు పుట్టి ఆ ఇంటిపై హక్కులు కోరకముందే, నువ్వు కోర్టులో దావా వెయ్యి" అంటూ మోహిని చాలాసార్లు పోరేది. ఊహు! కుదిరితే ఈ మేడను పేల్చేయాలని నా కోరిక. ఈ యింటిని నా నుంచి పెకిలివేయగలిగితే బోలెడంత ఓదార్పు.

గూడబాతుల క్వేక్ క్వేక్ చప్పుడు క్రమంగా అమ్మాయి కంఠస్వరంగా మారటం తెలుస్తుంది. చీకటిలో ఒట్టి మాటలే ప్రయాణిస్తున్నట్లుగా మోహిని. మధ్యలో 'ఊ' అంటూ మనోహర్ కంఠస్వరం. బేరేజ్ దాకా వెళ్ళి తినడానికేమయినా తెస్తామని వెళ్ళారు వాళ్ళిద్దరు. మోహిని తెల్లటిచీరలో, దూరం నుంచి తెల్లటిచారలా కనిపిస్తూనే ఉంది. పక్కనే నిప్పులముద్దలా, మనోహర్ నోట్లో సిగరెట్టుతో.

"లే, వేడి పరోటా, కూరా దొరికాయి. ప్రాణభయమేమీ లేదన్నారు డాక్టర్లు. మనమింక ఉపవాసాన్ని నటించనవసరంలేదు" మోహిని పొట్లాలు విప్పటం మొదలుపెట్టింది. కోకోసీసా మూతవిప్పి ఎదురుగా పెట్టాడు మనోహర్. న్యూస్ పేపర్ చించి, పరోట, కూరవేసి, వెచ్చగా ఆత్మీయంగా ఈ మోహిని, ఇట్లా జీవితమంతా నిండిపోతే ఎంత బాగుండునో అనిపిస్తుంది.

"గురూగారూ! రేపు నరసరావుపేట టౌన్‌హాల్లో మీటింగ్ ఉంది. ఈ ఆత్మహత్య ముచ్చట, మీటింగ్‌లో చెప్పమంటారా" రొట్టెను నములుతూ మనోహర్.

"ఆయనో గొప్ప లెజెండర్. పార్టీలో వున్నప్పుడు, బయటా కూడ. ఆయన జీవితమో వీరగాథ. ఆయన గురించిన ప్రతి విషయం జనానికి తెలియాలి. పార్టీ దుస్థితికి చింతిస్తూ ఆయన గుండె పగిలిందని, తన మరణంతోనైనా మళ్ళీ మనం ఉత్తేజితులం కావాలని ఆయన సంకల్పమంటూ చెప్పాలనుకొంటున్నాను!" అన్నాడు.

నేనేం మాట్లాడలేదు. దూరంగా నది చప్పుడు. మెల్లగా అడుగు వేస్తూ నడుస్తున్నట్లుగా. మోహిని తినడాన్ని ఆనందిస్తుంది. పరోట ముక్కను చాలాసేపు నములుతూ, కోకాకోలా ఒక గుక్క నోట్లో నింపుకొని – హఠాత్తుగా మనోహర్‌వైపు చూస్తూ "మనోహర్! ఇవాళ పార్టీ దాదాపు చచ్చిపోయింది. పట్టుమని పదిమంది కాడర్ కూడా లేని అనాథ అయ్యింది. ఈ తమాషా ఎందుకు. సుందరరామయ్య జీవితంలో నిన్ను ఉద్రూతలూగించిన విషయాలేమిటో నాకర్థం కావు. గొప్పకవే నిజం. ఆయన పాటల్ని అందరం పాడుకొన్నాం. అజ్ఞాతయోధుడుగా జీవించాడు. లాల్‌సలామ్ అన్నాం. ఇవాళేమీ లేదు. అంతా వదిలేసి మళ్ళీ జనం మధ్యకు అన్నాడు. మళ్ళీ ఎన్నికలన్నాడు. ఇదుగో ఇవాళ యిట్లా చావు కావాలి అంటున్నాడు. ఇద్దరు పెళ్ళాలు. ఒకటి పార్టీ చేసింది. ఇంకోటి ఆయన వెతుక్కొన్నది. ఇద్దర్నీ వదిలేశాడు. ఈ పక్కన పడుకొన్న మనిషి – అతని బాస్టర్డ్ చైల్డ్, అతన్నీ కాదన్నాడు."

నేను మోహినిని వింటున్నాను. మోహిని అంతే ఏదైనా తెగేసి చెప్పగలదు. ముఖంపై గుద్దినట్లుగా – మనోహర్ ముఖంలో తీవ్రమైన అలజడి. చేతిలోని కాగితాన్ని మడిచి, దూరంగా విసిరి – కోపంతో చాలాసేపు ఉడికిపోయి – "ఈ రాత్రికి ఇక్కడేనా. లోపల విజిటర్స్ గదులున్నాయి కదా" అన్నాడు, మాటల్లో విసుగు స్పష్టంగా తెలుస్తుంది.

"పైన వెన్నెల, అటు పక్కన నది, బొత్తిగా ఈస్థటిక్స్ లేనివాడివి మనోహర్. అట్లా నదివైపు వెళ్ళి, నీళ్ళలో తడుస్తూ – గొప్ప నటుడిగా చెప్పుకొంటావు. బొత్తిగా సౌందర్యదృష్టే లేదు నీకు" నవ్వుతూ గలగలమంటూ మోహిని. అప్రయత్నంగా లేచి నిలబడ్డాను నేను. మోహిని అనే మంత్రదీపం వెంట నేనూ, మనోహరూ.

మేడ క్రమంగా దూరమవుతుంది. దున్నిన పొలాల మధ్య నుంచి నడుచుకొంటూ – నది చప్పుడు దగ్గరవుతుంది. సుదీర్ఘమైన సంభాషణలా నీళ్ళు ప్రవహిస్తున్నాయి. నది అంచునే తెల్లటి తోటలా గూడబాతుల గుంపు. క్వేక్ క్వేక్ మంటూ వాటి అరుపులు. రెల్లుపొదల్ని చీల్చుకొంటూ ఇంకా దగ్గరకు,

నది దగ్గరకు - తెల్లగా, మిలమిలలాడుతూ స్వప్న సాక్షాత్కారంలా వుంది నది. గొప్ప మోహం, గొప్ప సుఖం, గొప్ప జ్ఞానం కలిగాయి. పురాతనమైన మేడ, మరణశయ్య పైని వృద్ధుడు, అతని గతం, నేలంతా చిమ్మిన అతని రక్తం - లోపలంతా కలదిరుగుతున్న అసహనం, అశాంతి - అంతా అదృశ్యమై - నిర్మలమైన కాంతి, నీటి మిలమిలలు మాత్రం మిగిలాయి.

అట్లా తలతిప్పి పక్కకు చూశాను. తెల్లని చీరలో నదివైపు పారవశ్యంగా చూస్తున్న మోహిని - అనిమేషంగా, ఆనందంగా - హఠాత్తుగా నాలో ఏదో మెరుపు. ఈ నదిపేరు మోహిని కాబోలు - లేదా మోహిని పేరు నది కాబోలు - ఇద్దరి సాన్నిధ్యంలోనూ ఎంత శాంతి, ఎంత హాయి - అనిపించింది.

బురద, ఇసుక మధ్య నుంచి నది పక్కనే అట్లా నడుస్తూ - క్వేక్ క్వేక్‌ల చప్పుడు, చప్పుడూ కాక, గొప్ప పాటలా, బృందగానంలా, నది వొడ్డున రెల్లు పొదల మధ్యన రెక్కల్ని విప్పి తెల్లటి గొడుగులు వొడ్డున పరిచినట్లుగా గూడబాతులు - తీవ్ర స్వనంలో క్వేక్, క్వేక్ అంటూ అరుస్తున్నాయి.

"వాటి పాట వింటున్నావా" మోహిని గుర్తు చేసింది. "ఊ, ఎన్ని ఉంటాయి. వందదాకా వుంటాయా" అడిగాను. "ఊహు! వంద కాదు! బహుశా వేలలో, ఇంకా ఎక్కువే, బహుశా విశ్వమంతా నిండిపోయి..." మోహిని ట్రాన్స్‌లో వున్నట్లుగా వుంది.

మనోహర్ మా యిద్దర్ని వదిలేసి కాస్త ముందుకు గూడబాతులు వున్న వైపుకు వెళ్ళాడు. రెల్లుపొదల మధ్యన అతని పాదాల చప్పుడు గరుగ్గా వినిపిస్తుంది.

మోహిని నా చేతుల్ని పట్టుకొని, ఒడ్డుపై ఎత్తుగా ఉన్న ఒక రాతిగుట్ట వైపు తీసుకెళ్ళింది. అక్కడ కూర్చుంటే, నది మధ్యన ఉన్నట్లు అనుభూతి. మోహిని గొంతులోంచి సన్నగా మధురంగా ఒక పాట బయటకు తన్నుకు వస్తున్నంతలో...

భయం గొలిపే చప్పుడొకటి - గూడబాతులన్నీ ఒక్కసారిగా పైకి లేచి భయ విహ్వలతతో అరిచినట్లుగా - అరుపుల మధ్య నుంచి ధన్‌మంటూ ఒక చప్పుడు. ఉలిక్కిపడి, భయపడి, గుండెల్లో దడదడమని - క్వేక్ క్వేక్. ఒక మరణపు చప్పుడు, కొన్ని వందల వేల గొంతుకలు నిరసనతో అరిచినట్లుగా - మళ్ళీ ఇంకోసారి ధన్‌మంటూ చప్పుడు. "గాడ్!" మోహిని గొంతులో దుఃఖం, కళ్ళలో నీళ్ళు, ముఖం రౌద్రమై "బ్లడీ రోగ్!" అంటూ గొణుగుతూ, ముందుకు నడిచి - మా కాళ్ళ చుట్టూ, మాపైన వందల తెల్ల మేఘాలు విచ్చుకొన్నట్లు గూడబాతులన్నీ లేచి, ఎగిరి, కల్లోల మేఘాల్లా అటూ ఇటూ పరిగెత్తుతూ -

మనోహర్ చేతిలో రెండు గాయపడ్డ గూడబాతులతో మావైపు నడుస్తూ, ఎర్రటి రక్తం ఇంకా వాటి శరీరంపై బుసబుసమనటం తెలుస్తూనే వుంది.

వాటి కాళ్ళను చేతుల్లో బిగువుగా పట్టుకొని – వాటి తలలు నేలపై జీరాడుతూ – గొంతులో ప్రాణం ఇంకా కొట్టుకులాడుతోంది.

మోహిని ఉగ్రంగా – కోపంతో మాటలు బయటకు రావటంలేదు. "ఇంత క్రూరంగా..." మొహం ఎర్రగా మాటలు రానట్లుగా అయిపోయింది మోహిని. మోహిని రియాక్షన్స్ పట్టించుకొన్నట్లు లేడు మనోహర్. "వాటే గ్రేట్ షాట్! తలలోంచి దూసుకుపోయి – గొప్ప దృశ్యం. రెండో షాట్ కూడా – గుడ్డి వెలుగులోనూ గురి తప్పలేదు..." వేట తాలుకు ఆనందంలో వెలిగి పోతున్నాడు మనోహర్. "నిరంజనా! టచ్ దెమ్. ఎంత లైవ్‌గా – ఎంత థ్రిల్‌గా వుంటుందో. రా వీటిని ముట్టుకో. మీ డాడీకి ఇవంటే ఎంతో ఇష్టం. ఇద్దరం ఇట్లాగే వెన్నెల రాత్రుల్లో పొదల మాటున కూర్చుని ఆయన దగ్గరో డబుల్ బారల్ వుండేది. ఒక్క షాటుతో ఏడెనిమిది గుంపు మధ్యన రాయి వేసి, అవి పైకి ఎగరటంతోటే – షాట్‌ని పేల్చేవాడు. వాటే థ్రిల్. ఆయన ఎక్స్‌పర్ట్ షూటర్. మీ అమ్మ ఎప్పుడూ గొడవ పెట్టుకొనేదట ఈ వేటను మానెయ్యమని. బట్, యూనో, ఇదొక ఎడిక్షన్" అంటూ గాయపడ్డ గూడబాతుల్ని నా చేతుల్లో పెట్టాడు. విసురుగా, కోపంగా వాటిని దూరంగా నదివైపు విసిరేశాను. నీటి స్పర్శతో, వాటిల్లో ఇంకా ప్రాణమున్న బాతు ఒకటి ఆబగా అటూ ఇటూ తన్నుకులాడుతోంది.

"వాట్ నాన్సెన్స్" మనోహర్ అరిచే లోపలే "హృదయంలేని ఒక మృగా నివి. నీలో ప్రేమించదగ్గ మంచిగుణం ఒకటీ లేదు. నువ్వొక దొంగ..." మాట పూర్తి చెయ్యకుండా కోపంగా అక్కడినుంచి చరచరా నడుచుకొంటూ వెళ్ళి పోయింది మోహిని.

"ఏమైంది. ఎందుకట్లా కోపం వచ్చింది మోహినికి" మనోహర్ కంగారు గా అడిగేడు.

ఇందాక ఒడ్డుకు విసిరిన, గూడబాతుల్లో ఒకటి తిరిగి ఊపిరి తెచ్చుకొని మెల్లగా పైకి లేచి – అట్లా నీటిపైకి ఎగిరి గొప్ప పునరుజ్జీవన దృశ్యాన్ని చూసిన అనుభూతి – పైకి ఎగిరి, రెక్కలు టపటపలాడించి, నాలుగడుగులు పైకి లేచి, అంతలోనే దబ్బుమని నీళ్ళలోకి పడింది. నీళ్ళపైన కాసేపు తన్నుకులాడి, మెల్లగా లోపలికి నీటిలోకి మునిగిపోయి – నీళ్ళు కాసేపు గిజగిజలాడి, అటు ఇటు తెర్లి – కాసేపటికి నిశ్చలంగా, నిశ్శబ్దంగా మారిపొయ్యాయి.

పొలాల మధ్యన మౌనంగా, సంతాపయాత్రలా నడుస్తూ – "ఎందుకు మీ యిద్దరింత డ్రామా చేస్తున్నారు గూడబాతుల్ని చంపటం కూడా నేరమా మీ భాషలో – అప్పటికి మీకే గొప్ప హృదయమున్నట్లు – మేమంతా రాక్షసుల మైనట్లు – ఇదొక ఈస్థటిక్ డ్రామా. ఈపాటి హింసకు గిజగిజలాడేవాళ్ళు మీరేం ఉద్యమాలు చేస్తారు. పోలీసుల లాఠీదెబ్బలు తిని కరుడుగట్టిన చేతులివి.

పక్షుల్నే కాదు అవసరమైతే మనుషుల్ని కూడా వేటాడడానికి సిద్ధపడ్డ కార్యకర్త చేతులివి? ఒక్క పక్షి చచ్చినందుకు పసిపిల్లల్లా గొల్లుమంటున్నారే! బుల్ షిట్'' మనోహర్ ఉగ్రంగా మారేడు.

నేనేం మాట్లాడలేదు. రెల్లుపొదల్ని దాటి, పసుపు పంట వేసిన పొలం మధ్యలో జాగ్రత్తగా నడుస్తున్నాను. దూరంగా ఒంటరి దీపం, మేడ, గేటు బయట ఎత్తయిన రాయిపై పడుకొని మోహిని. మళ్ళీ ఇందాకటి దృశ్యం, మరణపు వాసన, ఒక అసహనం నన్ను చుట్టుముట్టాయి.

వెళ్ళి మోహిని పక్కనే కూలబడ్డాను. ఆ పక్కనే మనోహర్, గాఢంగా, బరువుగా, చలికి వణికిపోతూ వృద్ధమాతలా రాత్రి. పన్నెండు దాటి వుంటుంది. ''అట్లా బారేజ్‌వైపు వెళ్ళి టీ ఏమైనా దొరుకుతుందేమో చూసి రానా'' అన్నాడు మనోహర్ రాజీ చేసుకొందామనే ఆలోచనతో. ''నువ్వు తెచ్చే టీకి కూడా రక్తపు వాసన, మరణపువాసన అంటే ప్రమాదం వుంది. ఎదురుగా ఒక చావు. ఇందా కటి నది చావు - మరింకీ రాత్రికీ మరణాలు చాలు'' అంది మోహిని కరుగ్గా.

ధన్ మంటూ లేచి నిలబడ్డాడు మనోహర్ ముఖం జేవురించి. కాళ్ళు బలంగా నేలకేసి తన్ని ''బిచ్'' అంటూ సన్నగా గొణిగి, మేడవైపు నడిచాడు. గేటు తీసి లోపలికి వెళ్ళిన మనోహర్‌ని తన పురాతనత్వంలోకి, ఒంటరితనం లోకి, నిశ్శబ్దంలోకి కలుపుకుందా మేడ.

''చానా యేళ్ళ క్రితం మనం కూర్చున్న ఈ ప్రదేశంలో ఒక తోట ఉండేది. చందమామ కథల్లో లాగ పొడవాటి వృక్షాలు, లతలు అల్లుకుపోయి - చెట్ల గుబుర్లు గొడుగులా మారిపోయి - తోట మధ్యలో కుర్చీల్లాంటి సిమెంటు బెంచీలుండేవి''.

మోహినికి ఏమాత్రం ఆసక్తి కలిగించని నాస్టాలిజియాలోకి వెళ్ళి పోయాను. ఇది మోహిని వినాలని కాదు. కానీ అట్లా గొంతు విప్పి నన్ను నేను కెలుక్కోవటం ఒక అవసరమనిపించింది.

''స్కూలు నుంచి వస్తూనే సిమెంటు బెంచీపై కూలబడేవాడిని. జాగ్రఫీలు, హిస్టరీలు, సైన్సులు కుక్కిన సంచిని కోపంగా విసిరి, - 'చందమామ' పుస్తకం తీసుకొనేవాడిని. ఆ కథలు చదువుతున్న సమయంలో, కథల్లోంచి ఒక అమ్మాయి నిశ్శబ్దంగా వచ్చి నా పక్కన కూర్చునేది. నవ్వులు విసిరి, కబుర్లు చెప్పి, ఆటలు ఆడి - కథల్లోంచి వచ్చిన ఆ అమ్మాయికి నేను 'అమ్మలు తల్లి' అని పేరు పెట్టుకొన్నాను. ఆ అమ్మాయి గుప్పిటలో చందమామల్ని పూయిం చేది. చెట్ల నుంచి క్షణాల్లో జలజలమంటూ పూలు రాల్చేది. నేలను కెలికి, చేతుల్తో తవ్వి రహస్య జంతువుల్ని బయటకు తీసేది. కోకిలగానో, పురివిప్పిన నెమలిగానో, జింకగా, కుందేలుగా, రకరకాలుగా మారిపోయి ఒక అద్భుత ప్రపంచాన్ని చూపేది. ఆమె వయసెంతో అర్థమయ్యేది కాదు. వయసులు,

పెరగడాలు వగైరాలు లేని దేవతల అమ్మాయిలా ఉండేది. పగలు అయిపోయి, రాత్రిలో చీకటింకా ముసరని సమయంలోనే ఆ అమ్మాయి కనబడేది. చీకటి బాగా ముసిరినా, లేదా ఎదురు మేడలో సుందరరామయ్య గంభీరంగా పచార్లు చేస్తుండినా, ఆ అమ్మాయి వచ్చేదికాదు.

"అమ్మలు తల్లికి తోటంటే ఇష్టం. ఈ సిమెంటు బెంచీ అంటే మరీను. బెంచీపై పడుకొని ఇంద్రధనస్సును సృష్టించి, బెంచీ చుట్టూ అల్లేది. ఆ తరువాత ఒక పాటను రప్పించి, గాలిలోకి వదిలేది. పాట చుట్టూ కాసిన్ని కోయిలల్ని, కుందేళ్ళని ప్రవేశపెట్టి - ఆ దృశ్యం ఎంతో హాయిగా వుండేది. ఒక్కోసారి తనే గొప్ప పాటలాగా మారిపోయేది. చెట్టుకొమ్మలపైన, పొడవుగా కిందకు జారిన ఊడలపైన ప్రయాణిస్తూ - ఝుం, ఝుం అంటూ - ఆ పాటలోని హాయిని ఏమని చెప్పేది!

"అమ్మలు తల్లి, పిలిస్తేనే ప్రత్యక్షమయ్యేది. అదీ చందమామ పుస్తకం ముందు వేసుకొని, ఆ కథల్లోంచి పిలిస్తేనే - ఒకసారి మాత్రం నేను వచ్చేసరికే, అమ్మలు తల్లి బెంచీపై వుంది. అప్పుడు అమ్మలు తల్లి ఒక పాటలా మారిపోయి వుంది. నేను ఎప్పుడూ చూడని మరో మనిషి, మొలచుట్టూ సన్నని ధోతీ మాత్రం వున్నవాడు - అమ్మలు తల్లి ఎదురుగా నిలబడి వున్నాడు. 'రా, నా పాటను, నా పెదాల్ని ముద్దుపెట్టుకో. తప్పెటపై బ్రహ్మాండంగా చిందుపాట మోగించే నీ చేతుల్తో నా శరీరాన్ని ముట్టుకో. నాలో పాట చచ్చిపోతుంది. నాలో మనిషి చచ్చిపోతుంది. నా పల్లెతనం నాలోంచి హరించుకుపోతోంది. నన్ను ముట్టుకొని, నన్నూ, నా పాటను, నా పల్లెదనాన్ని బతికించు' అంటూ పెద్దగా ఏడవటం మొదలుపెట్టింది. భయంవేసి ఇంటివైపు పరిగెత్తాను. బాగా చీకటి పడుతోంది అప్పుడు. సుందరరామయ్య ఇంటికి వస్తున్నాడు.

"ఆ మరుసటిరోజు నిద్రలేచే సమయానికి ఇంటి ముందు భయం కరమైన మంటలు. తోటనంతా కొట్టేసి, నేలపై పేర్చి పెట్రోలు పోసి నిప్పు పెట్టారు. తోట మాయమైంది. ఈ రాళ్ళగుట్ట మాత్రం మిగిలింది.

"అమ్మలు తల్లి మళ్ళీ నాకెప్పుడూ కనబడలేదు. చాలారోజుల పాటు చందమామ పుస్తకాలు పట్టుకొని ఈ మైదానమంతా తిరిగేవాణ్ణి తన కోసం.

"అమ్మా, నేను ఈ మేడలోంచి నిర్దయగా బయటకు తోసివెయ్య బడడానికి రెండురోజుల ముందు - మేడ వెనుక అవుట్‌హౌస్‌లో, అమ్మలు తల్లి వేసుకొనే బట్టలు, ఆమె పాట కనిపించాయి. గోడకు తగిలించి వున్నాయి. బట్టలనిండా, పాట నిండా రక్తం."

నేను మాట్లాడటం ఆపివేశాను. మోహిని ఏం మాట్లాడలేదు. క్షణంసేపు గాఢంగా నిట్టూర్చి - నాకు దగ్గరగా జరిగి, రెండు చేతులు మెడ చుట్టూ వేసి - ఊహించని వేగంతో నా పెదవుల్ని ముద్దు పెట్టుకొంది. నాలో కంగారు,

కోపం, అసహనం. నా ఎమోషన్స్‌ని ఏమాత్రం పట్టించుకోలేదు మోహిని. మెడ చుట్టూ పాకిన తన చేతుల్ని తీసివేసే ప్రయత్నం చెయ్యలేదు.

"నిరంజనా! అమ్మలు తల్లిలాగే నా దళిత సౌందర్యం నాలోంచి అంతరించిపోకుండా వుండటం కోసం ఈ ముద్దు. 'దళిత యువతిని, నిన్ను చేసుకోవటం ద్వారా ఎంత త్యాగం చేస్తున్నానో చూడు' అని కొన్ని వందలసార్లు నన్ను తూట్లు పొడిచేవాడు మనోహర్. ఈ మనోహర్‌లను, ఈ సుందరరామయ్యలను ఫెడేల్‌మని తన్ని, మళ్ళీ తన పేగులోకి పునఃప్రయాణించి – త్రీ చీర్స్ టు అమ్మలు తల్లి."

ఒంటరి రాత్రి, నిదిరిస్తున్న మేడ, నా శరీరంపై అల్లుకొన్న ఈ మోహిని – దృశ్యం మొత్తం చాలా అబ్సర్డ్‌గా, అనీజీగా వుంది. కానీ ఏదో పురాతన దృశ్యం తిరిగి ప్రత్యక్షమయినట్లుగా హాయిగా కూడా వుంది. మోహిని చేతులు రెండూ చూస్తుండగానే లతల్లా మారిపోయి, మోహిని శరీరం మహావృక్షంలా మారిపోయి – మళ్ళీ అలనాటి నా బాల్యపు తోట తిరిగి ప్రత్యక్షమై – మోహిని అనే వృక్షం పెరిగి పెరిగి – మహాబోధిలా తోచి – చటుక్కున లేచి ఆమె పాదాలను కళ్ళకు అద్దుకొన్నాను.

సరిగ్గా అప్పుడే మేడలోంచి ఏడుపులు, గగ్గోళ్ళు వినబడ్డాయి. లైట్లన్నీ భగ్గుమన్నాయి. సుందరరామయ్య మరణం గొప్ప దుఃఖంగా, వందలాదిగా మనుషులు మూగటంగా, షామియానాగా, మేడపై అవనతమైన జెండాగా – మైకుల్లో జోహారు పాటలా రూపాంతరం చెందింది.

మనోహర్ ఊహించినట్లుగా ఆ మేడను సుందరరామయ్య పార్టీకి రాసివ్వలేదు. తన కొడుకైన నిరంజనకు చెందాలంటూ – నాకు నవ్వు, గొప్ప హుషారు కలిగాయి. పాతికేళ్ళ స్వప్నం నాది. ఈ యింటిని బుల్‌డోజర్లతో కూల్చివేయాలని – ఆ కూల్చివేసే కార్యక్రమాన్నంతా, మొదటినుంచి, చివరి వరకూ – నా ప్రియమైన రాతిబండపై కూర్చుని చూడాలని – మోహిని ఆ ప్రయత్నాల్ని కుదరనీయలేదు. "ఈ మేడ ఒక చరిత్ర" అని తన వాదన. "పోనీ, ఈ మేడను నాకిచ్చెయి. అమ్మలు తల్లికి జరిగిన అవమానానికి పరిహారంగా, మేడపై దళిత జెండా ఎగరేస్తాను" అంది. ఆ సలహా నాకు నచ్చింది.

సుందరరామయ్య చనిపోయిన పదవరోజున ఆ మేడ కొత్త వాతావరణాన్ని సంతరించుకొంది.

మనోహర్ పదివేల మంది జనంతో సంస్మరణ సభ ఏర్పాటు చేశాడు. మేడ ఆవరణలో సభకు మోహిని అనుమతించని కారణంగా మేడ బయట విశాలమైన ఆవరణలో సభను నిర్వహించాలని నిర్ణయించుకొన్నాడు.

అమ్మలు తల్లి జ్ఞాపకంగా మేడ ఆవరణలో దళిత జానపద కళలపై సెమినార్‌ను ఏర్పాటు చేసింది మోహిని.

పదిరోజుల తరువాత మళ్ళీ ఆ ప్రదేశానికి వచ్చిన నాకు రెండు వింత సంఘటనలు కనబడ్డాయి.

మేడకు ఫర్లాంగు దూరంలో ఒక షామియానా కింద మనోహర్ మరో ఇరవైమందితో ఒక నాటకాన్ని ప్రాక్టీసు చేస్తున్నాడు. సుందరరామయ్య జీవితం మొత్తాన్ని నాటకంగా రాసి, సంస్మరణ సభలో ప్రదర్శించాలని - షామియానా లోకి అడుగుపెడుతూనే నేను దిమ్మెరపోయాను. సుందరరామయ్య సజీవమై ఎదురుగా నిలిచినట్లు - మనోహర్ సుందరామయ్య పాత్రలో అద్భుతంగా ఇమిడిపోయాడు. ఆహార్యం, మానరిజమ్స్, నడక - అచ్చం సుందరరామయ్య లాగే - మళ్ళీ ఆయన్ను చూస్తున్నట్లుగా - ఒక 'డి-జావ్' ఫీలింగ్ కలిగి క్షణం పాటు ఉలిక్కిపడ్డాను.

మేడలో మరోరకం హడావుడి. మోహిని మరికొంతమంది ఆడవాళ్ళతో కలిసి మేడకు కొత్తరూపాన్ని తెచ్చే ప్రయత్నంలో వుంది.

డెబ్భైయేళ్ళ వయస్సున్న మేడ. గోడల పైని ఎర్రని పెయింటును పారలతో గీకి వేస్తున్నారు. పీపాల నిండా కొత్తగా కలిపిన రంగులు.

మధ్యలో ఉన్న హాలును అందంగా తీర్చిదిద్దాలని మోహిని గొప్ప ప్రయత్నం చేస్తోంది. గోడలపైనున్న వాల్ పేపరు పెట్లిపోయి, బిగుసుకుపోయి వుంది. ఎర్రరంగు వాల్ పేపరది. దానిపై ఉదయిస్తున్న సూర్యుని బొమ్మ, రంగు వెలిసిపోయి, నల్లగా, కాంతిహీనంగా మారిపోయింది. ఆ వాల్‌పేపర్‌ను చించివేసే కార్యక్రమం చూస్తే పెద్ద యుద్ధ సన్నాహం గుర్తుకొస్తుంది. వాల్ పేపరు కింద గోడల నిండా న్యూస్ పేపర్లు, పేపర్ కటింగ్స్ అతికించి వున్నాయి. లెనిన్ మరణం, బెర్లిన్ యుద్ధం, తెలంగాణా సాయుధ పోరాటపు ముచ్చట్లు, ఒక్కొక్క పేపరును చించుతుంటే, కాలపు పొరల్లో ప్రయాణిస్తున్నట్లుగా వుంది. న్యూస్‌పేపర్ల కటింగ్‌ల మధ్య అమ్మ ఫోటో కనబడి ఉలిక్కిపడ్డాను. "మనకు తెలియని గొప్ప మహిళా కామ్రేడ్ మాలతి" అని ఫోటో కింద రాసి వుంది. "తక్కెళ్ళపాడు దళితుల భూపోరాటంలో మాలతి..." అంటూ న్యూస్ ఐటమ్. గొప్ప పులకరింత, ఉద్వేగం కలిగాయి. ఆ పేపరు కటింగ్‌ను మెల్లగా గోడపై నుంచి లాగివేసి, భక్తితో జేబులో దాచుకొన్నాను.

గోడలపైనున్న పేపర్లన్నీ లాగివేసినాక, క్షణాల్లో ఇరవైకి పైగా చేతులు, చేతుల్లో బ్రష్‌లతో గోడలపైకి ఎగబడ్డారు. జ్ఞాపకాలన్నీ క్రమంగా చెరిగి పోతున్నాయి. ఆహ్లాదకరమైన కొత్త రంగులెన్నో గోడలపై తళతళలాడుతున్నాయి.

*- ఆదివారం ఆంధ్రజ్యోతి, 3 సెప్టెంబర్ 2000*